సాక్షి
జగిత్యాల
బుధవారం ၊ 24 ၊ మే ၊ 2023



సీపీఆర్‌పై శిక్షణ

రాయికల్ : ఒడ్డెలింగాపూర్, రాయికల్ సెక్షన్‌లోని ట్రాన్స్‌కో సిబ్బందికి మెడికల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్ సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు.



కొనుగోలు కేంద్రాల పరిశీలన

కథలాపూర్ : మేడిపెల్లి, కథలాపూర్ మండలం తాండ్ర్యాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ లత పరిశీలించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

25న టీసీఎస్ రాత పరీక్ష

జగిత్యాల: ప్రముఖ ప్రైవేట్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 25న కరీంనగర్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా మంగళవారం తెలిపారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో రెగ్యులర్ విధానంలో బీబీఏ, బీకాం, బీఎస్సీ జనరల్, బీబీఏ, బీఏ, బీఏఎఫ్, బీబీఐ కోర్సుల్లో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల యువత బయోడెటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో అదేరోజు పరీక్ష కేంద్రంలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

సైక్లింగ్‌తో ఆరోగ్య సమాజం



మాట్లాడుతున్న కిషన్

మల్లాపూర్(కోరుట్ల): రోజూ సైకిలింగ్ చేయడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాల్గొట్ కిషన్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి సైకిల్ తొక్కుతూ మంగళవారం ఆయన వాల్గొండకు చేరుకున్నారు. సైకిల్ తొక్కడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు క్యాతం వెంకటరెడ్డి, ఇస్లావత్ బలరాంనాయక్, సబ్బని గంగరాం, బొర్ర రవి, కుమ్మరి మల్లేశ్, వీరేశ్, గుమ్ముల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పరిసరాలు పరిశీలిస్తున్న చారి

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలం పడకల్ గ్రామంలో మంగళవారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను రాష్ట్ర కో ఆర్డినేట్ ఆఫీసర్ కేఎస్ చారి పరిశీలించారు. వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, క్రీడా ప్రాంగణం, నర్సరీ, రీడింగ్ రూం తదితర వాటిని సందర్శించారు. సర్పంచ్ కంది లావణ్య, ఉప సర్పంచ్ అరిగెల స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విత్తన మేళా

జగిత్యాలరూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం ఆధ్వర్యంలో బుధవారం విత్తనమేళా నిర్వహించనున్నట్లు సహాయ పరిశోధన సంచాలకుడు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం నుంచి విడుదలైన వివిధ రకాల నాణ్యమైన విత్తనాలు విక్రయానికి అందుబాటులో ఉంచుతామన్నారు. పంటల సమగ్ర సమాచారంపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల్లోపు వ్యవసాయ పరిశోధనస్థానంలో రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న శ్రీధర్

జగిత్యాల: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామీణ ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు స్వచ్ఛ ఈ సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఈ సేవ సీఈవో శ్రీధర్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వచ్ఛ ఈ సేవ కేంద్రాల ద్వారా బిల్లుల చెల్లింపులు, బస్సు, విమాన టికెట్ల బుకింగ్, కొత్త పాన్‌కార్డులు, అందులో సవరణలు, టెలికాం, పోస్ట్‌పెయిడ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గలవారు http://www.swacheseva.com/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు



కాలువ పరిశీలిస్తున్న విద్యాసాగర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): భారీవర్షాలకు దెబ్బతిన్న డీ–29 కాలువను మరమతు చేయించి ఎస్సారెస్పీ నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కె.విద్యాసాగర్‌రావు ఈఈ వెంకటేశ్వర్లును కోరారు. ఒబులాపూర్‌లో దెబ్బతిన్న ఎస్సారెస్పీ డీ–29 కాలువను మంగళవారం ఎస్సారెస్పీ ఎస్ఈ సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.

రోడ్డుపై వడ్ల బస్తాలు వేసి.. బైఠాయించిన రైతులు



జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోలు, రవాణాలో జాప్యం, తూకంలో మోసం, కోతలను నిరసిస్తూ తిప్పన్నపేట రైతులు మంగళవారం జగిత్యాల–సారంగాపూర్ మెయిన్ రోడ్డుపై బైఠాయించారు. వడ్లబస్తాలు, చెట్లకొమ్మలు అడ్డుగా వేసి నిరసన వ్యక్తం చేశారు. ఐకేపీ కేంద్రంలో ధాన్యం పోసిన రైతులు.. ఆ తర్వాత మెయిన్ రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రైస్‌మిల్లులకు తరలించడంలో లారీల కొరతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి వారికి మద్దతు పలికారు.

కోతలకు అంగీకరిస్తేనే అన్‌లోడ్..



జగిత్యాలరూరల్: గుల్లపేట సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో వడ్లు విక్రయించిన రైతులు ఆందోళనకు దిగారు. రైస్‌మిల్లుకు తరలించిన ధాన్యం బస్తాలో రెండు కిలోలు కోత విధిస్తామని, ఇందుకు అంగీకరిస్తేనే అన్‌లోడ్ చేసుకుంటామని మిల్లర్లు చెప్పారు. దీనికి రైతులు నిరాకరించారు. దీంతో నాలుగు రోజులపాటు లారీని అక్కడే ఉంచిన మిల్లర్లు.. నేరుగా కొనుగోలు కేంద్రానికి వాపస్ పంపించారు. రైతులు కొంగరి సంతోష్‌రెడ్డి, దమ్మ రవీందర్‌రెడ్డి, కొంగరి నరేశ్, కొంగరి గంగారెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

సింగిల్‌విండో చైర్మన్ ఇంటి ముట్టడి..



వెల్గటూర్(ధర్మపురి): వెల్గటూర్ సహకార సంఘం పరిధిలోని మొక్కట్రావుపేట కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజులుగా కొనుగోళ్లు నిలిపి వేశారు. ఆగ్రహించిన అన్నదాతలు సింగిల్ విండో చైర్మన్ గోళి రత్నాకర్ ఇంటిని ముట్టడించారు. ధాన్యం కొనుగోళ్లు ఎందుకు నిలిపి వేశారని నిలదీశారు. సుమారు రెండు గంటలపాటు వాగ్వాదానికి దిగారు. అకాల వర్షానికి వడ్లు తడిచి తమకు నష్టం వచ్చిందని ఆవేదన చెందారు. అధికారులతో మాట్లాడి బుధవారం కొనుగోళ్లు పునరుద్ధరిస్తామని చైర్మన్ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

అన్నదాత నిలువుదోపిడీ



ఈ రైతు పేరు బద్దం గంగాధర్. ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట స్వగ్రామం. తాను పండించిన 60క్వింటాళ్ల వడ్లను సింగిల్‌విండో కొనుగోలు కేంద్రంలో పదిరోజుల క్రితం విక్రయించాడు. నిర్వాహకులు క్వింటాకు 5కిలోల చొప్పున మూడు క్వింటాళ్ల ధాన్యం కోత విధించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,060 చొప్పున లెక్కిస్తే.. కోతతో రైతు రూ.6,180 వరకు నష్టపోయాడు.



మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ రైతు రాజం 23 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాడు. క్వింటాల్‌కు 7కిలోల చొప్పున కోత పెట్టగా రూ.3 వేల వరకు నష్టపోయాడు. ఎంతో శ్రమించి పంట పండిస్తే.. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు కోతలతో దోపిడీ చేస్తున్నారని రాజం కన్నీటిపర్యంతమయ్యాడు.

మెట్‌పల్లి(కోరుట్ల): ధాన్యం రైతులు దగా పడుతన్నారు. ఆరుగాలం శ్రమంచి పండించిన పంటను కోతల పేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు గద్దల్లా తన్నుకుపోతుంటే సహించలేకపోతున్నారు. వారి అక్రమాలను నిరసిస్తూ అన్నదాతలు జిల్లావ్యాప్తంగా ఆందోళనకు దిగినా పట్టించుకునేవారే కరువయ్యారు. అటు మంత్రి కొప్పుల ఈశ్వర్, ఇటు ఎమ్మెల్యేలు కోతలు విధిస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నా.. ఎవరూ ఖాతరు చేయడంలేదు. కోతల రూపంలో కర్షకుల నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి.

4.56 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం..

- జిల్లాలో ఈ యాసంగిలో 4.56లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధ చేశారు.
- ఇందుకోసం 409 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- గతయాసంగిలో 364 కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం దిగుబడి అధికంగా వస్తుందనే అంచనాతో అదనంగా 45 కేంద్రాలు ప్రారంభించారు.
- రెండురోజుల క్రితం అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం ఇప్పటివరకు 2,05,552 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.
- ఇందులో 1,83,204 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించారు.
- ఇంతవరకు బాగానే ఉన్నా.. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు, మిల్లర్లు తాలు, తప్ప పేరిట క్వింటాలుకు 5కిలోల వరకు కోత పెడుతున్నారు.



జగిత్యాల రూరల్ మండలం తిప్పన్నపేటలో మంగళవారం రోడ్డుపై బైఠాయించిన రైతులు

- రైతులు నిలదీస్తే అన్‌లోడ్ చేయబోమని మిల్లర్లు బెదిరిస్తున్నారు.
- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్ల తీరును నిరసిస్తూ రైతులు రోడ్డెక్కుతున్నారు.
- గతంలో ఎన్నడూ లేనివిధంగా కొనుగోళ్ల విషయంలో సోమవారం ఏకంగా జిల్లాబంద్ నిర్వహించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

మంత్రి, ఎమ్మెల్యేల ఆదేశాలు బేఖాతరు..

ధాన్యంలో కోతలపై విమర్శలు రావడంతో కలెక్టరేట్‌లో ఈనెల 16న మంత్రి కొప్పుల ఈశ్వర్ సమీక్షించారు. ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ధాన్యంలో కోతలు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. కోతలు పెడితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇది జరిగి వారం గడిచినా నిర్వాహకులు, మిల్లర్లు దర్జాగా కోతలు విధిస్తున్నారు.

రైతు కష్టం వాటాలుగా..

- ధాన్యంలో కోతలతో ఒక్కో రైతు రూ.వేలల్లో నష్టపోతున్నాడు.
- కోతలతో రైతులు రూ.కోట్లల్లోనే నష్టపోతున్నారు.
- ఈ సొమ్మును నిర్వాహకులు, మిల్లర్ల నుంచి మొదలుకొని పైస్థాయి వరకు వాటాలుగా పంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పోరాటం చేస్తాం



ధాన్యం కొనుగోళ్లలో అక్రమంగా కోతలు విధిస్తున్నారు. రైతులు ఆందోళనలు చేస్తున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మిల్లర్లు భారీగా ఆర్జిస్తున్నారు. ఈ వివరాలు సేకరిస్తున్నాం. త్వరలోనే న్యాయ స్థానాన్ని ఆశ్రయించి రైతుల కోసం పోరు చేస్తాం.

– వాకిటి సత్యంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ కిసాన్ సెల్

కుమ్మక్కయ్యారు

మాది రైతు ప్రభుత్వమని బీఆర్ఎస్ చెప్పుకోవడం సిగ్గుచేటు. మిల్లర్లు, అధి కారులు కుమ్మక్కై ధా న్యంలో కోతలు పెడు తూ రైతులను దోచుకుంటున్నారు. ఏటా ఇలాగే అక్రమాలు జరుగుతున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా స్పందించాలి.

– మోరపల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, బీజేపీ

ఇళ్లస్థలాల కోసం కదంతొక్కిన మహిళలు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కోరుట్ల: సంగెం రోడ్డు జంబిగద్దె ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కావాలని కోరుతూ మహిళలు చేపట్టిన ఆందోళన మంగళవారం 44వ రోజుకు చేరింది. ఈసందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సుమారు 1,300 మంది మహిళలు.. తమకు 100 గజాల ఇళ్లస్థలాలు కేటాయించాలని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ ఇళ్లస్థలాల కోసం చేస్తున్న పోరాటంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు జోక్యం చేసుకోవాలన్నారు. ఇళ్లస్థలాల కోసం పోరుచేస్తున్న మహిళలను పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నాయకులు తిరుపతి నాయక్, పోషన్న పాల్గొన్నారు.

సార్.. లెటర్ ప్లీజ్

- డీఎస్పీ నుంచి ఎస్సైల వరకు సిఫారసుల కోసం పరుగులు
- పోస్టింగులు ఇప్పించాలని ఎమ్మెల్యేలకు వినతులు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు బదిలీల ముహూర్తం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే సివిల్ సర్వెంట్ల బదిలీలు
- త్వరలో మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు?



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఎప్పుడు ఎన్నికల షెడ్యూలు వచ్చినా.. విధుల నిర్వహణకు సిద్ధంగా ఉండేలా పోలీసు కమిషనర్లు, ఎస్పీలు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పోస్టింగుల కోసం ప్రయత్నాలు చేసే పోలీసు అధికారులు సైతం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మూడేళ్ల గడువు తీరిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ పోస్టు కోసం ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ కోసం డీఎస్పీ, ఏసీపీ ర్యాంకు అధికారుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. చాలాకాలంగా లూప్‌లైన్‌లో ఉన్న వారు, పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న వారంతా అధికార పార్టీ ఎమ్మెల్యేల ద్వారా సిఫారసు లేఖల కోసం యత్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కొందరు, విధేయత చూపిస్తామని మరికొందరు లీడర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారులు ఇటీవల అడపాదడపా బదిలీ అయినా.. ఎస్సై ర్యాంకు అధికారులు మాత్రం మార్చిలోనే మరో చోటికి బదిలీ అయ్యారు.

వెంటాడుతున్న నిబంధనలు..

కరీంనగర్ జిల్లా ముందునుంచి రాజకీయంగా ప్రత్యేకతను కలిగిఉంది. సంచలనాలు, ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరున్న జిల్లాలో పోలీసులు, రెవెన్యూ అధికారులకు పోస్టింగులు దక్కడం ఆషామాషీ కాదు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉప్పు నిప్పు అన్న పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలంతా విశ్వసనీయతను పక్కనబెట్టి ప్రతిభావంతులు, సమర్థులైన అధికారుల వైపే మొగ్గు చూపుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్ల నుంచి ఆర్డీవోలు, డీఎస్పీ, తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, ఎస్సైల వరకు అందరికీ ఇదే సూత్రం పాటించాలని నిర్ణయానికి వచ్చారు. ఎక్కడ చిన్న లోపం దొరికినా.. ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పకడ్బందీగా పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న అధికారులంతా ఆ నియోజకవర్గంలో పనిచేయకూడదు. అదే సమయంలో గతంలో అదే నియోజకవర్గంలో ఉప ఎన్నిక లేదా జనరల్ ఎన్నికలు నిర్వహించి ఉండకూడదు.

దశాబ్ది ఉత్సవాల తరువాత బదిలీలు..

విశ్వసనీయ సమాచారం ప్రకారం...ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇన్‌స్పెక్టర్ల వంటి పోస్టింగులు చాలావరకు మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల వ్యవహారం రాజధానిలో నిర్ణయిస్తారు. కానీ... ఆర్డీవో, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఎస్సై ర్యాంకు అధికారుల్లో చాలామంది తదుపరి పోస్టింగ్ ఎక్కడన్నది ఇప్పటికే దాదాపు అవగాహన ఉంది. కొన్ని సాంకేతిక సమస్యల కారణాలతో బదిలీలు ఆలస్యమవుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు అంటే జూన్ 2 తర్వాత కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

జగిత్యాల జిల్లా

కలెక్టర్: యాస్మీన్‌బాషా: ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): మందా మకరంద్, ఏడాదిగా పనిచేస్తున్నారు.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): లత, రెండేళ్లుగా కొనసాగుతున్నారు.
ఎస్పీ: భాస్కర్, ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
ఆర్డీవోలు: మెట్‌పల్లి–కోరుట్ల ఆర్డీవోగా ఉన్న వినోద్, జగిత్యాల ఆర్డీవోగా ఉన్న మాధురి మూడేళ్లుగా పనిచేస్తున్నారు.
డీఎస్పీలు: ప్రకాశ్, రవీందర్‌రెడ్డి కాస్త అటూ ఇటూగా రెండేళ్లుగా పనిచేస్తున్నారు.

కరీంనగర్ జిల్లా

కలెక్టర్: ఆర్వీ కర్ణన్ దాదాపు రెండేళ్లుగా పనిచేస్తున్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ జనరల్ ఎన్నిక నిర్వహించారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): శ్యామ్ ప్రసాద్‌లాల్ ఐదేళ్లుగా పనిచేస్తున్నారు.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): గరిమ అగర్వాల్ ఏడాదిన్నర కింద చేరారు.
సీపీ కరీంనగర్: ఎల్. సుబ్బారాయుడు, ఇటీవలే విధుల్లో చేరారు.
అడిషనల్ డీసీపీ (ఎల్అండ్‌వో): శ్రీనివాస్, మూడేళ్లుగా కొనసాగుతున్నారు.
అడిషనల్ డీసీపీ (అడ్మిన్): చంద్రమోహన్, నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు.
ఏసీపీలు: అర్బన్ ఏసీపీ తుల శ్రీనివాస్, రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు రెండేళ్లలోపే..హుజూరాబాద్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉపఎన్నిక ముందు వచ్చారు.
ఆర్డీవోలు: కరీంనగర్ ఆనంద్‌కుమార్ ఐదేళ్లవుతోంది.. హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు.

పెద్దపల్లి జిల్లా

కలెక్టర్: సంగీత సత్యానారాయణ, రెండేళ్లు అవుతోంది.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): లక్ష్మీనారాయణ, మూడున్నరేళ్లవుతోంది.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): దీపక్‌కుమార్, రెండేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్నారు.
సీపీ రామగుండం: రేమా రాజేశ్వరి, ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.
ఆర్డీవోలు: పెద్దపల్లి–వెంకట మాధవరావు, మంథని– వీర బ్రహ్మచారి ఇద్దరూ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
డీఎస్పీలు: ఎడ్ల మహేశ్ ఇటీవలే వచ్చారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ రెండేళ్లు దాటింది.

సిరిసిల్ల జిల్లా

కలెక్టర్: అనురాగ్ జయంతి.. ఏడాదిన్నర పూర్తి చేసుకున్నారు.
ఎస్పీ: అఖిల్‌మహాజన్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): ఖీమ్యా నాయక్, ఏడాది గడిచింది.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): సత్యప్రసాద్, రెండేళ్లు గడిచాయి.
ఆర్డీవోలు: సిరిసిల్ల–టీ.శ్రీనివాసరావు నాలుగేళ్లు.. వేములవాడ– పవన్ కుమార్ ఏడాది దాటింది.
డీఎస్పీలు: సిరిసిల్ల– విశ్వప్రసాద్ ఏడాది దాటింది. వేములవాడ– నాగేంద్రాచారి ఏడాదిన్నర అయింది.

మెరిసిన ఆణిముత్యాలు

సివిల్స్‌లో ఉమ్మడి జిల్లావాసుల ప్రతిభ

- ఆవుల సాయికృష్ణకు 94వ ర్యాంకు
- 132వ ర్యాంకు సాధించిన శివమారుతిరెడ్డి

వాళ్లు లక్ష్య సాధనపైనే దృష్టి సారించారు.. కృషి, పట్టుదలతో చదివారు.. ఒకసారి తప్పినా మరోసారి మరింత కసి పెంచుకున్నారు.. తల్లిదండ్రులు, పెద్దల ప్రోత్సాహంతో ముందుకు కదిలారు.. అకుంఠిత దీక్షతో చదివారు.. సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించారు.. విజయానికి పేదరికం, ఆర్థిక పరిస్థితేవీ అడ్డుకాదని నిరూపించారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆవుల సాయికృష్ణ, ఏనుగు శివమారుతిరెడ్డి.

– కరీంనగర్/కోరుట్ల

సుమితా డావ్రా స్ఫూర్తి : సాయికృష్ణ



'సివిల్స్ అనేది ఓ తపస్సు లాంటిది.. ఎన్ని గంటలు, ఎంతసేపు చదివామన్నది కాదు.. ఎంత విషయ పరిజ్ఞానం పెంపొందించుకున్నామనేదే ముఖ్యం' అని సివిల్స్–2022 ఫలితాల్లో ఆల్ ఇండియాలో 94వ ర్యాంకు సాధించిన ఆవుల సాయికృష్ణ అన్నారు. ఆయన మాటల్లోనే..

ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాదు..

ఉన్నత చదువులకు పేదరికం, ఆర్థిక పరిస్థితులు కారణాలు కానే కావు. కంటెంట్ కాదు.. క్వాలిటీ ముఖ్యం. నేను చదువుకుంటున్న రోజుల్లో కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేసిన సుమితా డావ్రా నాకు స్ఫూర్తి.

కరీంనగర్, హైదరాబాద్‌లో చదువు..

కరీంనగర్ పారమిత పాఠశాల, ఇంటర్మీడియట్ హైదరాబాద్ నారాయణ కళాశాల, ఇంజినీరింగ్ వరంగల్ నీట్‌లో సాగింది. మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ఆవుల లక్ష్మయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ సునీత గృహిణి. సోదరుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం. రెండో ప్రయత్నం లోనే 2017 బ్యాచ్‌లో 728వ ర్యాంక్ సాధించిన. మినిస్టరీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ రీజినల్ డైరెక్టర్ (ఎస్ఈఆర్), హైదరాబాద్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా. ఎలాగైనా ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఆరోసారి పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నించా.

మార్గదర్శకులు వీరే...

ఎస్ఈఆర్‌లో నా సీనియర్ తక్కళ్లపల్లి యశ్వంత్ రావు సూచనలు, సలహాలు పాటించా. ఎన్ని గంటలు చదివామన్నది కాకుండా.. ఏ మేరకు విషయ పరిజ్ఞానం అవలోకనం జరిగిందో తెలుసుకోని విశ్రమించకుండా, తక్షశిల కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మార్గదర్శనం ఎంతో ఉపయోగపడింది.

తండ్రి మార్గనిర్దేశం..



శివమారుతిరెడ్డి తల్లిదండ్రులు అంజిరెడ్డి–పుష్పలత

సివిల్స్‌లో పల్లె ఆణిముత్యం మెరిసింది. చిన్ననాట తండ్రి మార్గనిర్దేశనంలో ఇచ్చిన లక్ష్యం చేరుకోవడంలో ఆ యువకుడు విజయం సాధించారు. ఆయనే ఏనుగు శివమారుతిరెడ్డి. మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 132 ర్యాంకు సాధించి సత్తా చాటారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు అంజిరెడ్డి–పుష్పలత దంపతుల కుమారుడు శివమారుతిరెడ్డి. అంజిరెడ్డి మల్లాపూర్ మండలం గుండంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పుష్పలత వ్యవసాయ పనులు పర్యవేక్షిస్తారు. ప్రాథమిక విద్యాభ్యాసం కోరుట్ల మండలం అయిలాపూర్ విశ్వశాంతి పాఠశాల జరిగింది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ హైదరాబాద్ శ్రీచైతన్య కళాశాలలో సాగింది. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ యూనివర్శిటీ బీఏ(ఎకనామిక్స్)లో చేరారు.

రెండో ప్రయత్నంలో..

మూడేళ్లక్రితం డిగ్రీ పూర్తిచేసి 2021లో తొలిసారి సివిల్స్ రాశారు. ఆ సమయంలో కోవిడ్ బారిన పడి ప్రిలిమినరీలో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తండ్రి అంజిరెడ్డి ప్రోత్సాహంతో మళ్లీ సన్నద్ధమయ్యారు. రెండోసారి విజయం సొంతం చేసుకున్నారు.

నాన్నపై ప్రేమతో.. : శివమారుతిరెడ్డి

ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేస్తూ పిల్లలను తీర్చిదిద్దడానికి మా నాన్న పడుతున్న తపనను చిన్ననాటి నుంచి గమనించా. ఉన్నత ఉ ద్యోగం సాధిస్తే ఆయన బాటలోనే లక్షలాది మందికి సేవలు అందించవచ్చన్న ఆలోచనతో సివిల్స్‌పై దృష్టి పెట్టా. అమ్మ పుష్పలత, నాన్న ఆశయాలు సాధించడానికి కష్టపడి చదివా. ప్రస్తుత ర్యాంకు ప్రకారం ఐఏఎస్ క్యాడర్ వస్తుందని ఆశిస్తున్నా. అందులో చేరాక మళ్లీ సివిల్స్ రాస్తా. ఫారిన్ సర్వీసెస్ సాధించాలన్నది నా లక్ష్యం.

రోజూ 8గంటలు చదివా..



ప్రతీరోజు 8 గంటలు చ దివేవాడిని. సిలబస్‌ను చిన్నచిన్న విభాగాలుగా మార్చుకుని వారానికి ఓ విభాగం లెక్కన ఒకదాని తర్వాత ఒకటి పూర్తిగా చదివి అవగాహన పెంచుకున్నా. సివిల్స్ సాధనలో నాకు ఎన్‌సీఈఆర్‌టీ బేసిక్ నుంచి ఉన్నతస్థాయి వరకు ఉన్న పుస్తకాలు ఉపయోగపడ్డాయి.

క్లుప్తంగా

స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు డీటీవో దరఖాస్తు?


శ్యామ్‌నాయక్

జగిత్యాల క్రైం: జిల్లా రవాణా శాఖ అధికారి అజ్మీరా శ్యామ్‌నాయక్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సంబంధిత దరఖాస్తును ఆయన రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రసాద్‌కు అందజేయగా ప్రభుత్వానికి పంపించినట్లు సమాచారం. డీటీవో శ్యామ్ నాయక్ భార్య నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. దీంతో ఆయన కూడా రాజకీయాల్లోకి వెళ్లేందుకు ముందస్తుగా ఉద్యోగ విరమణ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

వడదెబ్బతో జీపీ కార్మికుడి మృతి


రాజన్న (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల):జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు నక్క రాజన్న (50) వడదెబ్బతో మంగళవారం మృతిచెందాడు. మల్టీపర్పస్ కార్మికుడిగా పనిచేస్తున్న రాజన్న సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అదే రాత్రి ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. సర్పంచ్ ఎడమల జయ, ఉపసర్పంచ్ రాచకొండ రాజేశం, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



ధర్మపురి: జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 కిలోల బస్తాకు రూ.845 చెల్లించాలన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. అనంతరం వ్యవసాయ పనుల కోసం తక్కువ వడ్డీతో రుణాలు తీసుకున్న వారికి రూ.25.20 లక్షల విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు ఎల్లాగౌడ్, పెద్ద పోశం, సీఈవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం.. కమీషన్ల పర్వం

- జిల్లాలో వెలుస్తున్న మల్టీస్పెషాలిటీ, క్రిటికల్ కేర్ ఆస్పత్రులు
- ఆర్‌ఎంపీలు, అంబులెన్స్‌ల నిర్వాహకులతో యాజమాన్యాల కుమ్మక్కు
- పేషెంట్లను తీసుకొస్తే ఇష్టారీతిన బిల్లులు
- ఆర్థికంగా నష్టపోతున్న పేద ప్రజలు


జగిత్యాల అశోక్‌నగర్‌లో వెలసిన ప్రైవేటు ఆస్పత్రులు

"జగిత్యాల జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్‌లో ఇటీవల కొత్తగా ఓ ఆస్పత్రిని నెలకొల్పారు. యాజమాన్యం అంబులెన్స్ నిర్వాహకులతో ఒప్పందం చేసుకుందో ఏమో.. ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ పేషెంట్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లమంటే అక్కడివరకు తీసుకెళ్లి, ఈ దవాఖానాలోచూడదరట అని నేరుగా కొత్త ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ సదరు పేషెంట్ తలకు దెబ్బ తగిలిందని ఎంఆర్‌ఐ, సిటీస్కాన్ చేసి, దాదాపు రూ.20 వేల వరకు బిల్ వేల్లు వేశారు. అనంతరం మళ్లీ కరీంనగర్ పంపించారు. జగిత్యాలలో ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి."

జగిత్యాల: జిల్లాలో ఇటీవల మల్టీస్పెషాలిటీ, క్రిటికల్ కేర్ అంటూ కొత్త ఆస్పత్రులు ప్రారంభిస్తున్నారు. వైద్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వైద్య వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుస్తోందన్న ఆరోపణలున్నాయి. ఆస్పత్రుల నిర్వాహకులు ఆర్‌ఎంపీలను ఆశ్రయించి, పేషెంట్లను తమ దవాఖానాలకు పంపించేలా వారికి టూర్లు, విందులు ఏర్పాటు చేయడం, తాయిళాలు ఇవ్వడం ఇప్పటివరకు చూశాం. కానీ ప్రస్తుతం అంబులెన్స్ నిర్వాహకులను సైతం మచ్చిక చేసుకొని, పేషెంట్లను తీసుకువచ్చేలా చూస్తున్నారు.

నష్టపోతున్న పేదలు..

జగిత్యాలలో కృష్ణానగర్, సంతోష్‌నగర్, అశోక్‌నగర్‌లలో అత్యధికంగా ఆస్పత్రులున్నాయి. ఈ ప్రాంతాల్లోనే కొందరు ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకొని, మల్టీ స్పెషాలిటీ పేరిట ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఎక్కడి నుంచో డాక్టర్లను తీసుకువచ్చి, వైద్యం చేయిస్తున్నారు. పేషెంట్లను ఆస్పత్రికి తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తూ, అధిక బిల్లులు వేస్తుండటంతో పేద ప్రజలు నష్టపోతున్నారు.

ఏ ప్రమాదం జరిగినా వాలిపోతారు..

పేషెంట్లను తీసుకువస్తే ఆస్పత్రుల యాజమాన్యాలు అంబులెన్స్‌ల నిర్వాహకులు, ఆర్‌ఎంపీలకు కమీషన్లు ఆఫర్ చేస్తున్నాయి. ఫలితంగా ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు అక్కడ వాలిపోతున్నారు. బాధితులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. వైద్యులు చిన్నపాటి దెబ్బలకు సైతం ఎంఆర్‌ఐ, సిటీస్కాన్ చేయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

నిబంధనల ఉల్లంఘన..

నిబంధనల ప్రకారం ప్రతీ ఆస్పత్రికి అనుమతి ఉండటంతోపాటు అందులో ఏ డాక్టర్ ఉన్నారు.. ఎంతెంత ఫీజులు తీసుకుంటున్నారన్న బోర్డులు ఉండాలి. ఇటీవల కొత్తగా హాస్పిటళ్లను ఏర్పాటు చేసినవారు అనుమతి తీసుకున్నా, ఏ డాక్టర్ ఉన్నారు.. ఎంత ఫీజులు తీసుకుంటున్నారన్న వివరాలను అందుబాటులో ఉంచడం లేదు. మూడు నెలలకో డాక్టర్‌ను మార్చుతున్నారు. వైద్యుడు మారితే ఆయన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు.

పట్టించుకోని వైద్యశాఖ..

జిల్లాలో వైద్యశాఖ అధికారులు ప్రతీ ఆస్పత్రిని తనిఖీ చేయడంతోపాటు నిబంధనలు పాటిస్తున్నారా లేదా పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా ఈ విషయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆస్పత్రుల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం, చిన్నచిన్న అద్దె భవనాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. మరి అనుమతులు ఎలా ఇస్తున్నారో అధికారులకే తెలియాలి.

ధాన్యం 50 శాతమైనా కొనలే

- తరుగు పేరుతో మిల్లర్లు దోచుకుంటున్నరు
- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 50 శాతం ధాన్యం కూడా కొనలేదని, తరుగు పేరుతో రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం ధర్మపురిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం తెచ్చి, 45 రోజులు కావస్తున్నా కొనుగోళ్లు పూర్తవడం లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలతోనే అధికారులు కొనుగోళ్లు వేగవంతం చేయడం లేదని పేర్కొన్నారు. కేంద్రాల్లో పోసిన ధాన్యం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్‌లు కచ్చితమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 4, 5 రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలను రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు ఎస్.దినేశ్, సింహరాజు ప్రసాద్, రాందేని మొగిలి, స్తంభంకాడి గణేశ్, అప్పం తిరుపతి తదితరులున్నారు.



విభిన్న పార్టీలు.. ఇద్దరు నేతలు

జగిత్యాలరూరల్: రైతు సమస్యలపై ఎక్కడైనా పోరాటం చేస్తామని, సమస్య పరిష్కారమయ్యే వరకూ అండగా ఉంటామని రెండు జాతీయ పార్టీల నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట ఐకేపీ కేంద్రంలో రైతు సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ఇలా ఒకేచోట కలిసి కనిపించడంతో రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, కార్యదర్శులు

సారంగాపూర్(జగిత్యాల): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లో ఇటీవల ముగిసిన సీఎం కప్ పోటీల విజేతలకు బహుమతి అందజేశారు. అనంతరం రెండు మండలాల్లో తమ పోస్టులను రెగ్యులర్ చేసినందుకు సీఎం కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీఆర్‌ఏలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను రెగ్యులర్ చేసి, ఎన్నో కుటుంబాలకు ప్రభుత్వం భద్రత కల్పించిందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్ పేరుతో మండలస్థాయిలో క్రీడలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 29 మందికి కల్యాణలక్ష్మి, 28 మందికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ సభ్యుడు మేడిపల్లి మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు కొల్ముల రమణ, ముక్క శంకర్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, నల్ల మహిపాల్‌రెడ్డి, సర్పంచులు గర్షకుర్తి శిల్ప, సింగిల్‌విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోజురోజుకూ రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): ప్రభుత్వ అనాలోచిత, స్వార్థపూరిత నిర్ణయాలతో రోజురోజుకూ రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి, మంగేళ, సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, పెంబట్ల, రంగపేట గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీఆర్‌ఏ పోస్టులను రెగ్యులర్ చేసి, అదే శాఖలో కొనసాగించాలన్నారు. వారిని ఇతర శాఖలకు బదిలీ చేస్తే క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకునేవారు ఉండరని పేర్కొన్నారు. మండలంలోని ఇద్దరు ఆర్‌ఐలు ఎన్ని గ్రామాల్లో పర్యటించగలుగుతారో ఆలోచించాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు ఎస్పీ, అటవీశాఖ నివేదికలు దేనికని ప్రశ్నించారు. చిన్న పంచాయతీల్లో దళిత, గిరిజన సర్పంచులు ఆర్థికంగా లేకపోవడంతో తమ గ్రామాల్లో కొన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయలేకపోయారని చెప్పారు. ఆయా పల్లెల్లో పనిచేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ సభ్యురాలు పాత పద్మ, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, సర్పంచు బొడ్డుపల్లి రాజన్న, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు రంగు లక్ష్మణ్, మాజీ వైస్‌ఎంపీపీ కోండ్ర రామచంద్రారెడ్డి, చిరంజీవి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారంగాపూర్‌కు చెందిన బాలకృష్ణారెడ్డి ఓ విద్యార్థికి సైకిల్ అవసరం ఉండగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేతులమీదుగా అందించారు.

'ట్రక్‌షీట్‌తో రైస్‌మిల్లర్ల దగా'

జగిత్యాలరూరల్: రైస్‌మిల్లర్లు ట్రక్‌షీట్‌తో రైతులను దగా చేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. తిప్పన్నపేటలో రైతులు మంగళవారం చేపట్టిన ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయన్నారు. లారీలు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదని అన్నారు. అధికారుల మాటలకు, కార్యాచరణకు పొంతనే లేదని విమర్శించారు. రైస్‌మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడేందుకు ధర్మకాంట తూకాన్ని పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు లేఖ రాసినా ఫలితం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు లైశెట్టి విజయ్, ప్రభాకర్, భారతపు దుబ్బరాజం, బండారి మధు, ముంజం మహేశ్, మైదం ధర్మయ్య, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

'రైస్‌మిల్లర్లపై చర్యలేవి?'

ధాన్యం కొనుగోళ్లలో రైతులను దగా చేస్తున్న రైస్‌మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ప్రశ్నించారు. తిప్పన్నపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులకు మద్దతుగా ఆమె ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎద్మల శైలేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, కొక్కు గంగాధర్, జున్ను రాజేందర్, ప్రశాంత్, లక్ష్మీనారాయణ, రాము, రాకేశ్ పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టు(చొప్పదండి): స్థానిక శ్రీఆంజనేయ స్వామి వారి దేవస్థానానికి మంగళవారం వేలాది మంది భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా అభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. దాదాపు 15 వేల మంది వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు.

గర్భిణుల్లో ఎనీమియాను నివారించాలి

- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: గర్భిణుల్లో ఎనీమియాను నివారించాలని, ఇందుకోసం సీఎం కేసీఆర్ నూతనంగా న్యూట్రిషన్ కిట్ పథకం అమలు చేస్తున్నారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. న్యూట్రిషన్ కిట్ పథకం మొదటి దశలో 9 జిల్లాల్లో అమలు చేస్తున్నామని, కొద్ది రోజుల్లోనే 24 జిల్లాలకు విస్తరిస్తామన్నారు. తల్లీబిడ్డల సంరక్షణకు ఈ కిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కలెక్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. సబ్ సెంటర్ల నిర్మాణాల కోసం ముందస్తుగా జిల్లా పరిషత్‌లకు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేశామన్నారు. పనులు పూర్తి చేయించి, వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల నిర్మాణానికి త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, డీఎంహెచ్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

- యువకుడి దుర్మరణం

మెట్‌పల్లి(కోరుట్ల): వెల్లుల్ల శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాంకాలనీకి చెందిన విఘ్నేశ్, రాహుల్‌లు ద్విచక్రవాహనంపై వెల్లుల్ల వైపు వెళ్తున్నారు. అదే సమయంలో వెల్లుల్లకు చెందిన వన్నెల మహేశ్ బైక్‌పై మెట్‌పల్లికి వస్తున్నాడు. మార్గమధ్యంలో వీఆర్‌ఎం గార్డెన్ వద్ద వాహనాలు వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విఘ్నేశ్, మహేశ్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మహేశ్ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

విగ్రహ ధ్వంసం కేసులో ఇద్దరి రిమాండ్

గొల్లపల్లి(ధర్మపురి): మల్లన్నపేటలో హనుమాన్ ఆలయంలోకి చొరబడి, స్వామి వారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల గంగాధర్ తన భార్య కాపురానికి రావడం లేదని, నక్క శ్రీధర్ తనకు వివాహం కావడం లేదని రెండు రోజుల క్రితం స్థానిక హనుమాన్ దేవాలయంలో స్వామివారి విగ్రహాన్ని ధ్వంసం చేసి, పారిపోయారు. స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్టు చేశారు. జిల్లా మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఇద్దరికీ జ్యుడీషియల్ రిమాండ్ విధించారని ఎస్సై పేర్కొన్నారు.

వైద్య సేవలపై సీఎం ప్రత్యేక దృష్టి

- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


రేడియాలజీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్, పక్కన ఎంపీ వెంకటేశ్

జగిత్యాల: తెలంగాణ ఆవిర్భవించాక కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రూ.వేల కోట్లు వెచ్చించి వైద్య కళాశాలలు ప్రారంభిస్తున్నారని, అందులో మౌలిక వసతులు కల్పిస్తూ సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ థియేటర్, రేడియాలజీ ల్యాబ్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ మకరంద్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు, డీఎంహెచ్‌వో శ్రీధర్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికే..

గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీయడానికే సీఎం కప్- 2023 నిర్వహిస్తున్నామని మంత్రి ఈశ్వర్ అన్నారు. స్థానిక స్వామి వివేకానంద స్టేడియంలో క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పథకాలు దేశానికే ఆదర్శం

ధర్మపురి: సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి ఈశ్వర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు..

గాదెపెల్లి, తీగలధర్మారం గ్రామాల్లో రూ.60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు ఎస్సైల బదిలీ

రాయికల్(జగిత్యాల): జిల్లాలో ఏడుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ భాస్కర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మల్యాలలో పనిచేస్తున్న చిరంజీవిని మేడిపల్లికి, మేడిపల్లిలో పనిచేస్తున్న సుధీర్‌రావును వీఆర్ జగిత్యాల, బుగ్గారంలో అశోక్‌ను మల్యాలకు, జగిత్యాల సీసీఎస్‌లో సందీప్‌ను బుగ్గారానికి, బీర్పూర్‌లో అజయ్‌ని రాయికల్‌కు, రాయికల్‌లో కిరణ్‌కుమార్‌ను ఏఆర్ జగిత్యాలకు, మెట్‌పల్లిలో పనిచేస్తున్న సదాకర్‌ను జగిత్యాలరూరల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదోతరగతి చదువుకున్నవారు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి వారు చదువుకున్న పాఠశాలే వేదికైంది. 20 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితుల చూడటంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, గంగారాం, శంకర్, దేవరాజం, కమలారాణి, అనసూయ, జనార్దన్‌లను సత్కరించారు. అందరూ కలిసి భోజనం చేశారు. రోజంతా సందడి సందడిగా గడిపారు.

కథలాపూర్(వేములవాడ): మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో 1998-99లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఒక్కచోట చేరారు. పాఠశాలలోనే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసుకొని, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 24 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి లోనయ్యారు. పాఠశాలలో తాము చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తు చేసుకొని, నవ్వుకున్నారు. పాఠాలు బోధించిన టీచర్లను సన్మానించారు. అందరూ కలిసి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు.